మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో అమ్మవారి మంటపాలు, దేవాలయాల్లో 8వ రోజు అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజూ ఉదయం అర్చనలు, పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కుంకుమార్చన, అఖండ హారతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.
– రాజేంద్రనగర్ జోన్ బృందం


కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


అమ్మవారిని దర్శించుకున్న మంత్రి మహేందర్‌రెడ్డి


ఓయూ కాలనీ దుర్గామాత


నార్సింగిలో కౌన్సిలర్లు, నాయకులు


కాళికానగర్‌లో పీఏసీఎస్ చైర్మన్ రాందాస్

క్లుప్తంగా...

అయోధ్య రామ పాదుకల దర్శనం


శ్రీరామ పాదుకలను దర్శించుకున్న బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి

మణికొండ: అయోధ్య రామాలయంలో ఉండే శ్రీరాముని పాదుకలను భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13లోని హనుమాన్ దేవాలయానికి వేదమంత్రాలతో ఆహ్వానించి భక్తుల దర్శనార్థం ఉంచారు. దీంతో అలకాపూర్ టౌన్‌షిప్‌తో పాటు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని భక్తులు, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, బీఆర్‌వీపీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు స్వామివారి పాదుకలను దర్శించుకున్నారు.

ఇన్‌స్టాలో ప్రకటనతో మోసం

ఉద్యోగం ఆశ చూపి
రూ.97,581 దోచేసిన వైనం

శంషాబాద్ రూరల్: సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రాంలో వర్క్ ఫ్రమ్‌హోం ప్రకటన చూసి ఆశపడిన ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు. అతడి నుంచి కేటుగాళ్లు రూ.97,581ని దోచేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌గూడకు చెందిన ఆరె భాస్కర్ (21) తన ఫోన్‌లో ఈనెల 21న ఇన్‌స్టాగాం చూస్తున్నాడు. ఈ క్రమంలో వర్క్‌ఫ్రం హోం ప్రకటన చూసి అక్కడ ఉన్న లింక్ తెరిచి రిజిస్టర్ చేసుకున్నాడు. ఫోర్టల్ ఇంటర్‌ఫేస్‌లో రీచార్జ్‌పై పెట్టుబడి, ప్రతిఫలంగా డబ్బులు సంపాదించవచ్చని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో మొదట రూ.200 పెట్టుబడి పెట్టాడు. మరోసారి రూ.1,620, ఇలా మొత్తంగా పలు దఫాలుగా రూ.97,581 ఇన్వెస్ట్ చేశాడు. ఈ డబ్బులు రావడానికి పన్ను చెల్లించాలంటూ నేరగాళ్లు చెప్పడంతో తాను మోస పోయినట్లు గుర్తించాడు. ఆదివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడి నియామకం

బండ్లగూడ/రాజేంద్రనగర్: నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా అంతారం నరేష్ నియమితులయ్యారు. ఆదివారం బీసీభవన్‌లో జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. బీసీలు అన్ని రంగాల్లో మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీల సంక్షేమానికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో బీసీలందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి తమ హక్కుల కోసం పోరాడేలా కృషి చేస్తారన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న బీసీలు మరింత జాగ్రుతమై తమ హక్కులను సాధించుకునేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, జిల్లా అధ్యక్షులు ఆశోక్‌గౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజు యాదవ్, ఫియాజ్, ప్రవీణ్, భాస్కర్ తదితరులున్నారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న అంతారం నరేష్

జాతీయ సమగ్రతకు 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'


ఎన్‌సీసీ విద్యార్థులతో ఎయిర్‌కమాండర్ వీఎమ్ రెడ్డి

శంషాబాద్ రూరల్: జాతీయ ఐక్యత.. సమగ్రతను చాటి చెప్పేందుకే ఎన్‌సీసీ విద్యార్థులతో 'ఏక్ భారత్ శేష్ఠ భారత్' కార్యక్రమం చేపట్టినట్లు తెలుగు రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమాండర్ వీఎమ్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం, వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో 12 రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. యువత తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆర్మీ, నేవీలో ఎంపిక కోసం ఎన్ఎస్‌సీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు హిమాచల్‌ప్రదేశ్ ఇతర రాష్ట్రాల నుంచి 450 మంది కేడెట్లు పాల్గొంటున్నారన్నారు. ఎన్‌సీసీని మిషన్ లాగా భావించాలని, విపత్కర పరిస్థితుల్లో సెకండ్ లైన్ డిఫెన్స్ లాగా ఎన్‌సీసీ సేవలు వినియోగిస్తామన్నారు. ఎన్‌సీసీతో ఐక్యత, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అగ్నివీర్‌లో ప్రవేశాలకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల 'ఫ్లాగ్ మార్చ్'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌కు కేంద్ర పోలీసు బలగాలు చేరుకున్నాయి. మూడ్రోజుల క్రితం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కేంద్ర బలగాలను అప్పా పోలింగ్ సెంటర్‌తో పాటు ఎక్సైజ్ పోలీస్ అకాడమీలో బస కల్పించారు. అనంతరం రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అదనపు డీసీపీ రేష్మి పెరమూల్ ఆధ్వర్యంలో అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్లకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు ఆయా ప్రాంతాల్లో విధుల్లో పాల్గొంటున్నారు. మొదటిసారిగా కేంద్ర బలగాలు ఆయా ప్రాంతాలకు చేరడంతో స్థానిక పోలీసులతో కలిసి బస్తీలు, ప్రధాన రహదారుల్లో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లు అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో శనివారం సాయంత్రం నుంచి ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ తమకు కేటాయించిన ప్రాంతాలకు చేరుకుంటున్నారు. ఆదివారం నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అదనపు డీసీపీ రేష్మీ పెరమూల్‌తో పాటు ఏసీపీ గంగాధర్, ఆయా పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలో..

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రీపురం వట్టెపల్లి ప్రాంతాలలో ఆర్మ్‌డ్ ఫోర్స్ ,లోకల్ సివిల్‌ఫోర్స్‌తో కలిసి ఏరియాలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఏరియాలోని ప్రజలకు ఎలక్షన్స్‌పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఓటు హక్కును వినియోగించడం మన హక్కుగా భావించాలని ప్రజలకు సూచించారు. రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్ ,మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ మధు, అత్తాపూర్ సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మణికొండ: కాలనీలలో ఉన్న సమస్యల పరిష్కారానికి సంక్షేమ సంఘాలు తమ వంతు కృషి చేయాలని మణికొండ మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ పురుషోత్తం అన్నారు. వార్డు పరిధిలో సంతోష్‌నగర్ కాలనీలోని బాబు జగ్జీవన్‌రాం అసోసియేషన్ నూతన కార్యవర్గ కమిటీని ఆదివారం సభ్యులు ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామని, మిగిలిన సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకొస్తే మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికుల సేవలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ.. వారికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్ వెల్లడించారు. డివిజన్ పరిధిలో పనిచేస్తున్న జలమండలి, శానిటేషన్ సిబ్బందికి దసరా పండుగను పురస్కరించుకుని నూతన వస్త్రాలు, పండుగ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. రోజూ వారు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తేనే కార్పొరేషన్ ప్రజలంతా సుభిక్షంగా ఉంటారన్నారు. ఎలాంటి రోగాలు ధరిచేరకుండా ఉండేందుకు కార్మికులు రోడ్లు, పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు అనేక పనులు చేస్తారన్నారు. వారి సేవలను గుర్తించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పూజలు

మణికొండ: వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరాను అందించడంతో పాటు వారికి ఎదురయ్యే సమస్యలను సత్వరమే పరిష్కరించి వారి మన్ననలు పొందాలని సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈ వెంకన్న సూచించారు. మణికొండ మున్సిపాలిటీ పుప్పాల్‌గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం నిర్వహించిన దసరా పూజలకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సబ్‌స్టేషన్‌తో పాటు డీఈ సర్కిల్ పరిధిలో పెరుగుతున్న విద్యుత్ కనెక్షన్‌లు, లోడ్, కలెక్షన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇబ్రహింబాగ్ ఏఈ జ్ఞానేశ్వర్, విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం అడిషనల్ సెక్రటరీ, రీజినల్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, ఇబ్రహింబాగ్ డివిజన్ యూనియన్ అధ్యక్షుడు రత్నం, సబ్ ఇంజినీర్ చెన్నారెడ్డి, యూనియన్ డివిజన్ కార్యదర్శి పరబ్రహ్మమూర్తి, సిబ్బంది శంకర్‌నాయక్, మణికంఠరెడ్డి, ప్రణయ్, సాయికుమార్, శ్రావణ్, శివ తదితరులున్నారు.


శంషాబాద్ విద్యుత్ కార్యాలయంలో ఏస్ఈ గోపయ్య పూజలు

విద్యుత్ కార్యాలయంలో ఆయుధపూజ..

శంషాబాద్: శంషాబాద్ విద్యుత్ కార్యాలయంలో దుర్గాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ గోపయ్య ప్రత్యేక పూజలు చేశారు. రాజేంద్రనగర్ డివిజన్ డీఈ రత్నాకర్‌రావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాస్, ఏఈ అప్సర్ బాషా, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వెంకటేష్, రాజేష్, సిబ్బంది నర్సింహారెడ్డి, నాగవరప్రసాద్ అర్జున్ తదితరులున్నారు.

రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేతపై హర్షం


సాయియాదవ్

అత్తాపూర్: బీజేపీ ఫైర్ బ్రాండ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసిన బీజేపీ జాతీయ నాయకత్వానికి, రాష్ట్ర నాయకులకు అత్తాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సాయియాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ అధిష్టానం నిర్ణయం కోసం ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సస్పెన్షన్ ఎత్తివేస్తునట్లు గుడ్ న్యూస్ తెలియజేసిన బీజేపీ అధిష్టానానికి, రాష్ట్ర పార్టీ నాయకులు సాయియాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వేడుకగా సద్దుల బతుకమ్మ సందడి


కాపుగడ్డలో బతుకమ్మతో బయలుదేరుతున్న మహిళ

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికలు బతుకమ్మలతో ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలో పాల్గొన్నారు.
– రాజేంద్రనగర్ జోన్ బృందం


మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద..